సాక్షి
నంద్యాల
మంగళవారం ၊ 8 ၊ అక్టోబర్ ၊ 2024



సత్తా చాటారు

సి.బెళగల్‌లో రెండు రోజులుగా జరుగుతున్న అంతర్ జిల్లాల జూనియర్ షూటింగ్ బాల్ పోటీల్లో క్రీడాకారులు సత్తా చాటారు. విజేతలకు బహుమతులు అందజేశారు. 10లో▸



వాటా ఇవ్వాల్సిందే!

'లాటరీలో దుకాణం దక్కించుకున్నా ఫలితాలు మరోలా ఉంటాయి.. 30 శాతం వాటా అయినా ఇవ్వాలి' అంటూ దరఖాస్తుదారులను టీడీపీ నేతలు బెదిరిస్తున్నారు. 10లో▸



శ్రీశైలంలో 201 టీఎంసీలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలం డ్యాంలో సోమవారం సాయంత్రానికి 201.120 టీఎంసీల నీరు నిల్వ ఉంది. జలాశయానికి జూరాల, సుంకేసుల నుంచి 77,393 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉంది.

న్యూస్‌రీల్

శ్రీశైలం ఈఓగా పెద్దిరాజు కొనసాగింపు



శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థాన కార్యనిర్వహణాధికారిగా డి.పెద్దిరాజును కొనసాగిస్తు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు సోమవారం స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఎస్.సత్యనారాయణ జీవో 717ను జారీ చేశారు. తదుపరి ఉత్తర్వులు జారీ అయ్యేంత వరకు డి.పెద్దిరాజు శ్రీశైల ఈఓగా కొనసాగుతారని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈయన డిప్యూటేషన్‌పై దేవదాయశాఖకు బదిలీ అయి గత నెల 24వ తేదీకి ఏడాది పూర్తయింది. ఈ క్రమంలో ఆయన బదిలీ అవుతారని, కొందరు అధికారులు ఇక్కడికి వచ్చేందుకు కూడా ప్రయత్నించారు. ఎట్టకేలకు తన డిప్యూటేషన్‌ను కొనసాగించుకుంటూ సీటును డి.పెద్దిరాజు పదిలం చేసుకున్నారు.

అన్నప్రసాద వితరణకు రూ.3 లక్షల విరాళాలు



రూ.లక్ష విరాళాన్ని అందిస్తున్న కర్ణాటక భక్తుడు దులప్ప జుమానల్

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం భక్తుల సౌకర్యార్థం నిర్వహిస్తున్న అన్నప్రసాద వితరణ పథకానికి పలువురు భక్తులు రూ.3లక్షల విరాళాలను అందించారు. సోమవారం కృష్ణా జిల్లా చెన్నూరుకు చెందిన వై.సీతారామస్వామి రూ.1,00,116, రాజ మహేంద్రవరానికి చెందిన ప్రకాశరావు రూ.1,00,116, కర్ణాటక రాష్ట్రం బీజాపూర్‌కు చెందిన దులప్ప జుమానల్ రూ.1,00,001 విరాళాన్ని వేర్వేరు సమయాల్లో ఆలయ పర్యవేక్షకురాలు టి.హిమబిందుకు అందజేశారు. విరాళాలను అందించిన దాతలకు దేవస్థానం తరుపున స్వామివారి శేషవస్త్రాలను, లడ్డూప్రసాదాలను, జ్ఞాపికలను అందించి సత్కరించారు.

ఎన్‌ఎంఎంఎస్ దరఖాస్తు గడువు పెంపు

నంద్యాల(న్యూటౌన్): నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ దరఖాస్తునకు మరోసారి గడువు పెంచినట్లు డీఈఓ సుధాకర్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తుకు ఈనెల 3వ తేదీ వరకు గడువు ఉండగా దసరా సెలవులు, వివిధ కారణాల వలన ఈనెల 15వ తేదీ వరకు గడువు పెంచారన్నారు. జిల్లాలోని జిల్లా పరిషత్, మున్సిపల్, ఎయిడెడ్, మండల పరిషత్, ప్రాథమికోన్నత, ఆదర్శ పాఠశాలలల్లోని 8వ తరగతి విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు www.bse.ap.gov.inను సంప్రదించాల న్నారు.

ముగ్గురు డీసీసీబీ ఉద్యోగులపై క్రిమినల్ కేసు

కర్నూలు(అగ్రికల్చర్): కేడీసీసీ బ్యాంకు ఆత్మకూరు బ్రాంచ్‌లో ఇటీవల వెలుగు చూసిన కుంభకోణానికి సంబంధించి డిప్యూటీ జనరల్ మేనేజర్ ఉమామహేశ్వరరెడ్డి ఫిర్యాదు మేరకు ఆత్మకూరు పోలీస్‌స్టేషన్‌లో క్రిమినల్ కేసు నమోదైంది. క్యాషియర్ ఎస్.అల్తాఫ్ నిధులను మళ్లించగా.. ఈ అక్రమాన్ని చూసీచూడనట్లుగా పాసింగ్ ఆఫీసర్ వెంకటరంగయ్య వ్యవహరించారు. రెండు నెలలుగా నిధులు పక్కదారి పట్టినా మేనేజర్ పెద్ద పులిరాజు పట్టించుకోలేదు.రూ.78,77,767 కాజేసినట్లు నిర్ధారణ అయింది. ఈ మేరకు ఏ1గా అల్తాఫ్, ఏ2గా వెంకటరంగయ్య, ఏ3గా పెద్ద పులిరాజులపై కేసు నమోదైంది. ఆత్మకూరు పోలీసులు వీరు ముగ్గురినీ ఒకటి, రెండు రోజుల్లో అరెస్ట్ చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

ఫిర్యాదుల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు



ఫిర్యాదులను స్వీకరిస్తున్న ఎస్పీ అదిరాజ్‌సింగ్‌రాణా

బొమ్మల సత్రం: ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చిన ఫిర్యాదుల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా పోలీసు అధికారులను హెచ్చరించారు. సోమవారం స్థానిక కార్యాలయంలో నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో ఆయన పాల్గొని 86 ఫిర్యాదులు స్వీకరించారు. ప్రజలు ఇచ్చిన ఫిర్యాదులపై పూర్తి స్థాయి విచారణ జరిపి పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. సంబంధిత అధికారులతో స్వయంగా ఫోన్‌లో మాట్లాడి చట్టపరిధిలో ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ యుగంధర్ బాబు సిబ్బంది పాల్గొన్నారు.

ఆశల శనగ



కోవెలకుంట్ల సమీపంలో శనగ విత్తనానికి ముందు రసాయన మందు వేస్తున్న రైతు

వ్యవసాయంలో కష్టానికి ప్రతిఫలం దక్కాలంటే అదృష్టం తోడవ్వాల్సిందే. ప్రకృతి అనుకూలించి.. సకాలంలో వానలు కురిసి.. ఆశించిన మేర దిగుబడులు వచ్చి.. గిట్టుబాటు ధర దక్కితేనే రైతు గట్టెక్కుతాడు. ఈ ఏడాది ఖరీఫ్ కలిసి రాలేదు. సీజన్ మొదట్లో వర్షాభావం.. విత్తనం అదును ముగిసే సమయంలో అధిక వర్షాలు.. పంట చేతికందే సమయంలో ధర నేల చూపు.. అన్నీ వెరిసి ఖరీఫ్‌లో కుదేలయ్యారు. ఆ నష్టాలను పూడ్చుకోవాలని కోటి ఆశలతో రబీ సీజన్‌కు రైతులు సమాయత్తమవుతున్నారు. మొదటి పంటగా పప్పు శనగ సాగుకు సన్నద్ధమవుతున్నారు.

- రబీ సీజన్ మొదటి పంటగా పప్పు శనగ సాగు
- గత ఏడాది వెంటాడిన వర్షాభావం
- ఈ ఏడాది జిల్లాలో 1.70 లక్షల ఎకరాల్లో సాగు లక్ష్యం
- కోవెలకుంట్ల వ్యవసాయ సబ్ డివిజన్‌లో అత్యధిక విస్తీర్ణంలో సాగు
- అరకొరగా సబ్సిడీ విత్తనాల కేటాయింపులు

కోవెలకుంట్ల: రబీ సీజన్ ఈ నెల 1వ తేదీ నుంచి ప్రారంభం కాగా జిల్లాలో పప్పుశనగ విస్తారంగా సాగు కానుంది. గత ఏడాది శనగ సాగుకు వర్షాభావం వెంటాడటంతో దిగుబడులు గణనీయంగా తగ్గి నష్టాల పాలయ్యారు. ఈ ఏడాది విత్తనానికే ముందే వర్షాలు అనుకూలంగా మారటంతో శనగసాగుపై కోటి ఆశలు పెట్టుకుని రైతులు సాగుకు సన్నద్ధమవుతున్నారు. ఏటా జిల్లాలోనే అత్యధిక విస్తీర్ణంలో కోవెలకుంట్ల వ్యవసాయ సబ్ డివిజన్‌లో శనగ పంట సాగవుతోంది. నంద్యాల జిల్లాలోని 29 మండలాల పరిధిలో ఈ ఏడాది 1.70 లక్షల ఎకరాల్లో శనగ సాగు సాధారణ విస్తీర్ణంగా కాగా ఇందులో స్థానిక వ్యవసాయ సబ్ డివిజన్‌లోని కోవెలకుంట్ల, సంజామల, అవుకు, కొలిమిగుండ్ల, ఉయ్యాలవాడ, దొర్నిపాడు మండలాల పరిధిలో 1.03 లక్షల ఎకరాల్లో సాగు కావాల్సి ఉంది. శనగ సాగును దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం సబ్సిడీతో విత్తనాల పంపిణీ చేయాల్సి ఉంది. జిల్లాకు 42,155 క్వింటాళ్ల విత్తనాలు అవసరం కాగా ఇప్పటి వరకు 23,208 క్వింటాళ్ల శనగ విత్తనాలను మంజూరు చేసింది. మరో వారం రోజుల్లో శనగ విత్తనం వేసేందుకు రైతులు పొలాలను సిద్ధం చేసుకోగా ప్రభుత్వం అరకొర విత్తనాలనే సరఫరా చేయడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఆయా రైతు సేవా కేంద్రాల్లో రైతులు విత్తనాలు పొందేందుకు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్లకు అవకాశం కల్పించారు. ఎకరాకు 40 కిలోల చొప్పున, గరిష్ఠంగా ఐదు ఎకరాకు రెండు క్వింటాళ్ల చొప్పున సరఫరా చేస్తున్నారు. ప్రభుత్వ సబ్సిడీ పోనూ క్వింటాకు రైతులకు రూ. 7,050 చొప్పున చెల్లించాల్సి ఉంది. ప్రభుత్వం తక్కువ స్థాయిలో విత్తన కేటాయింపులు చేయడంతో విత్తనాల కోసం రైతులు అవస్థలు పడాల్సి వస్తోంది.



కోవెలకుంట్లలో శనగ విత్తనాల కోసం రిజిస్ట్రేషన్ చేసుకుంటున్న రైతులు

నవంబర్ 15 వరకు సాగుకు అదును

గత ఏడాది రబీ సీజన్‌లో ఆశించిన స్థాయిలో వర్షాలు కురవక పోవడంతో శనగసాగు విస్తీర్ణం గణనీయంగా తగ్గింది. 1.72 లక్షల ఎకరాలు శనగ సాగు కావాల్సి ఉండగా వర్షాభావ పరిస్థితుల కారణంగా కేవలం లక్ష ఎకరాలకు మించి రైతులు సాగు చేయలేకపోయారు.

ఎకరాకు రూ. 15 వేలు పెట్టుబడి

వర్షాధార పంటరకమైన పప్పుశనగ సాగుకు ఎకరాకు రూ. 15 వేలు పెట్టుబడి అవసరం. నల్లరేగటి భూములు పంట సాగుకు అనుకూలం. విత్తనానికి ముందే పదునయ్యే వర్షం, పైరు నెల రోజుల దశలో మరో వర్షం, చలి, మంచుతో పైరు చేతికందుతుంది. సేద్యం, ఎకరాకు రెండు బస్తాల డీఏపీ, విత్తనాలు, నాలుగు విడతల క్రిమి సంహారక మందులు, కలుపు, కోత, నూర్పిడి, తదితర రూపంలో పెట్టుబడులు వెచ్చించాల్సి ఉంది. వాతావరణం అనుకూలిస్తే



ఎకరాకు 8 నుంచి 10 బస్తాల దిగుబడులు వచ్చే అవకాశం ఉంది. ఈ ఏడాది విత్తనానికి ముందే విస్తారంగా వర్షాలు కురవడంతో సాధారణ విస్తీర్ణం మించి సాగయ్యే సూచనలు ఉన్నట్లు వ్యవసాయాధికారులు అంచనా వేస్తున్నారు.

జిల్లాలో శనగ సాగు వివరాలు

సబ్ డివిజన్	సాగు లక్ష్యం (ఎకరాల్లో)	సబ్సిడీ విత్తనాలు (క్వింటాళ్లు)
కోవెలకుంట్ల	1.03 లక్షలు	12,493
నందికొట్కూరు	0.26 లక్షలు	4,658
ఆళ్లగడ్డ	0.16 లక్షలు	2,051
నంద్యాల	0.16 లక్షలు	2,351
డోన్	0.05 లక్షలు	909
ఆత్మకూరు	0.04 లక్షలు	736

సాగు చేసిన పైరులో రసాయన ఎరువులు, క్రిమి సంహారక మందులు, కోత, నూర్పిడి, తదితర పెట్టుబడుల రూపంలో ఎకరాకు రూ. 20 వేల వరకు వెచ్చించారు. పైరు వివిధ దశల్లో కూడా వరుణుడు కరుణించకపోవడంతో దిగుబడులపై ప్రభావం పడింది. ఎకరాకు 3 నుంచి ఐదు క్వింటాళ్లలోపే దిగుబడులు వచ్చాయి. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి క్వింటా రూ. 5వేలకు పైగా ధర నిర్ణయించి దిగుబడులను విక్రయించింది. వర్షాభావంతో దిగుబడులు తగ్గినా గిట్టుబాటు ధరతో రైతులు నష్టాల ఊబి నుంచి కాస్త బయట పడ్డారు. గత ఏడాది జరిగిన నష్టాన్ని పూడ్చుకునేందుకు ఈ ఏడాది జిల్లాలో విస్తారంగా శనగ సాగుకు సిద్ధమవుతున్నారు. వచ్చే నెల 15వ తేదీ వరకు సాగుకు అనుకూలం కావడంతో విత్తనానికి పొలాలను సిద్ధం చేసుకుంటున్నారు. మరో వారం నుంచి విత్తనం వేసేందుకు అదును కావడంతో రసాయన ఎరువులు విత్తే పనుల్లో నిమగ్నమయ్యారు. ప్రస్తుత మార్కెట్ క్వింటా ధర రూ. 8వేల వరకు మద్దతు ధర ఉండటంతో రైతులు శనగ సాగుపై ఆశలు పెట్టుకున్నారు.

పండగ తర్వాత విత్తనం వేస్తా



నాకున్న మూడు ఎకరాల సొంత పొలంలో శనగ సాగుకు పొలాన్ని సిద్ధం చేసుకున్నాను. గత ఏడాది వర్షాభావంతో ఎకరాకు 3 క్వింటాళ్లకు మించి దిగుబడులు రాలేదు. ఈ ఏడాది విత్తనానికి ముందే వర్షాలు అనుకూలంగా మారటంతోసాగు అన్ని విధాలా కలిసి వస్తుందని భావిస్తున్నాం. పొలంలో రసాయన ఎరువులు వేసి సాగుకు సన్నద్ధమయ్యాను. దసరా పండుగ తర్వాత విత్తనం వేసేందుకు విత్తనాలను సమకూర్చుకున్నాను. – లక్ష్మీనారాయణ, రైతు, కోవెలకుంట్ల

అవసరమైన విత్తనాలు సరఫరా చేయాలి



గత ఏడాది వర్షాభావంతో శనగ సాగు కలిసి రాలేదు. గత ప్రభుత్వం మద్దతు ధర కల్పించడంతో నష్టాలబారి నుంచి కాస్త బయటపడ్డాం. ఈ ఏడాది నాకున్న పది ఎకరాల సొంత పొలంలో జేజీ–11 రకానికి చెందిన శనగ విత్తనం వేసేందుకు రసాయన ఎరువులు వేసి పొలాలను సిద్ధం చేసుకున్నాను. ప్రభుత్వం ఈ ఏడాది ఐదు ఎకరాల వరకు మాత్రమే సబ్సిడీపై విత్తనాలు సరఫరా చేస్తోంది. అలా కాకుండా కనీసం పది ఎకరాల సాగుకు విత్తనాలు సరఫరా చేయాలి.

– పులశేఖర్, రైతు, అమడాల, కోవెలకుంట్ల మండలం

సబ్సిడీ విత్తనాలను సద్వినియోగం చేసుకోండి



ఈ ఏడాది ప్రభుత్వం సబ్సిడీతో రైతులకు శనగ విత్తనాలను సరఫరా చేస్తోంది. నంద్యాల జిల్లాలో ఆరు వ్యవసాయ సబ్ డివిజన్లు ఉండగా ప్రతి ఏటా కోవెలకుంట్ల వ్యవసాయ సబ్ డివిజన్‌లో శనగ అధిక విస్తీర్ణంలో సాగవుతోంది. ఈ ఏడాది 1.03 లక్షల ఎకరాల్లో సాగు సాధారణ విస్తీర్ణం కాగా వాతావరణం అనుకూలంగా మారటంతో విస్తీర్ణం మరింత పెరిగే ఆస్కారం ఉంది. డివిజన్‌కు 12,493 క్వింటాళ్ల విత్తనాలను కేటాయించారు. రైతులు రైతు సేవా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్లు చేయించుకుని విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలి.

– నిరంజన్ ఏఓ, కోవెలకుంట్ల

నేరానికి భయం లేదు.. చట్టానికి కళ్లు లేవు!

- లింగందిన్నెలో తండ్రీకొడుకులపై టీడీపీ నేతల దాడి
- ఘటనను వీడియో తీశారనే అనుమానంతో ఓ వ్యక్తికి వేధింపులు
- స్టేషన్‌కు పిలిపించి చిత్ర హింసలు పెట్టిన పోలీసులు



తండ్రీ కొడుకులపై దాడి చేస్తున్న టీడీపీ నేతలు

ఆళ్లగడ్డ: అధికార బలంతో టీడీపీ నేతలు రెచ్చిపోతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో వైఎస్సార్‌సీపీ సానుభూతి పరులపై భౌతిక దాడులకు దిగుతున్నారు. పోలీసులను అడ్డం పెట్టుకుని అక్రమ కేసులు బనాయిస్తూ వేధింపులకు గురిచేస్తున్నారు. ఆళ్లగడ్డ మండలం లింగందిన్నెలో గ్రామంలో చోటు చేసుకున్న ఘటనే ఇందుకు నిదర్శనం. గ్రామస్తుల వివరాల మేరకు.. లింగందిన్నె గ్రామానికి చెందిన ఎల్లాల బాషా అనే ముస్లిం కుటుంబీకులు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సానుభూతిపరులుగా ఉన్నారు. గత ఎన్నికల్లో పార్టీ కోసం పని చేశారు. గ్రామంలోని చెందిన కొందరు టీడీపీ నాయకులు ఈ విషయాన్ని జీర్ణించుకోలేక ఆ కుటుంబాన్ని ఎలాగైనా బెదిరించి గ్రామం నుంచి పంపించేయాలని నిర్ణయించుకున్నారు. ఈ క్రమంలో సోమవారం గ్రామ వీధిలో ఉన్న ఎల్లాల మాబాషా, అతని కుమారుడు ఇస్మాయిల్‌తో అదే గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు, దేవస్థాన మాజీ చైర్మన్ సోమ ఓబుళరెడ్డి, సోమశేఖర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి ముందుగా వాగ్వాదం పెట్టుకున్నారు. అతర్వాత తండ్రికొడుకులపై తీవ్రంగా దాడి చేశారు. 'ఇంటి దగ్గర కట్టేస్తామంటూ' ఈడ్చుకుంటూ పోతున్నా.. కనీసం అడ్డుపడేందుకు కూడా ఎవరూ సాహసం చేయలేదు. పోలీసులకు సమాచారం ఇచ్చినా.. ఎవరూ రాలేదు. అయితే ఈ దాడిని సమీపంలోని వ్యక్తులు వీడియో తీసి సామాజిక మాధ్యంలో అప్‌లోడ్ చేశారు. అయితే ఆ సమయంలో అక్కడ ఉన్న వారిలో చాకలి రమణనే వీడియో తీశారని టీడీపీ నేతలు అనుమానించారు. ఎమ్మెల్యే వద్ద పీఏగా ఉన్న అదే గ్రామానికి చెందిన వ్యక్తి పోలీసులకు ఫోన్ చేసి రమణను బెదిరించాలని ఆదేశించాడు.

నిందితులకు 'పచ్చ' తివాచీ పరిచి..

ఎక్కడైనా గ్రామాల్లో సమస్యలు, ఉద్రిక్త పరిస్థితులు నెలకొంటే దానికి కారణమైన నిందితులను పోలీసులు దండించడం పరిపాటి. అయితే ఇక్కడ నిందితులను కుర్చీల్లో కూర్చో బెట్టి ప్రత్యక్ష సాక్షిని తీవ్రవాదులను కొట్టినట్లు కొట్టడం దారుణం. ఎమ్మెల్యే పీఏ చెప్పినట్లుగానే ఎస్ఐ నడుచుకున్నారు. చాకలి రమణను స్టేషన్‌కు పిలిపించాడు. అంతలో ఎమ్మెల్యే పీఏ, దాడి చేసిన గ్రామ టీడీపీ నాయకులు అక్కడికి చేరుకున్నారు. స్టేషన్‌లోనే రమణను నోటికొచ్చినట్లు తిడుతూ.. దాడి చేసేందుకు యత్నించినా పోలీసులు నోరు మెదపలేదు. పైపెచ్చు వీడికి భయం పెట్టు అని ఎస్ఐకి ఆర్డర్ వేయడమే ఆలస్యం.. చాకలి రమణను నిందితుల ముందు పడుకోబెట్టి ఒక పోలీస్ మోకాళ్లపై నిలబడగా, మరొకరు కదల కుండా పట్టుకోగా పోలీస్ అధికారి అరికాళ్లపై విక్షణారహితంగా కొట్టినట్లు తెలుస్తోంది. అతని అరుపులు విన్న రమణ భార్య లోపలికి వెళ్లి అడ్డుపడటంతో కొట్టడం ఆపి కేసు పెట్టి ఇంటికి పంపించారు. ఈ ఘటనపై వివరణ కోరేందుకు ప్రయత్నించగా పోలీస్ అధికారి స్పందించ లేదు.

టీడీపీ నేతల కళ్లలో ఆనందం చూసేందుకే



ఎమ్మెల్యే ఇంటి దగ్గర నుంచి ఫోను వచ్చింది.. అని ఎస్ఐ స్టేషన్‌కు రమ్మంటే వెళ్లా. అప్పటికే టీడీపీ నాయకులు ఉన్నారు. 'నాకేమి తెలియదు'.. అని చెప్పినా ఎస్ఐ వినలేదు. వారి ముందే నన్ను పడుకోబెట్టి గొడ్డును బాదినట్లు బాదాడు. దెబ్బలకు తట్టుకోలేక గట్టిగా కేకలు వేయడంతో బయట ఉన్న నా భార్య పరిగెత్తుకుంటూ లోపలికి వచ్చి అడ్డుపడింది. 'ఇక మీదట ఇలాంటి విషయాలు ఎవరికీ చెప్పవద్దంటూ బెదిరించారు. నాపై కేసు పెట్టి 'రేపు కోర్టుకు పోయి ఫైన్ కట్టు' అంటూ పంపించారు. టీడీపీ నేతల కళ్లల్లో ఆనందం చూసేందుకు నన్ను స్టేషన్‌కు పిలిపించి చావ గొట్టారు.

– చాకలి రమణ

స్కంద మాతా.. శుభములివ్వమ్మా!

- స్కందమాత అలంకారంలో శ్రీశైల భ్రామరీ
- శేష వాహనంపై ఆదిదంపతుల విహారం
- శ్రీగిరిలో వైభవంగా దేవీశరన్నవరాత్రులు



స్వామి అమ్మవార్లకు ఆలయ ప్రదక్షిణ చేస్తున్న దృశ్యం

శ్రీశైలంటెంపుల్: దసరా నవరాత్రోత్సవాల్లో భాగంగా శ్రీగిరిలో ఐదవ రోజు సోమవారం శ్రీశైల భ్రమరాంబాదేవి స్కందమాత స్వరూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. నవదుర్గాలలో ఐదవ రూపమైన ఈ దేవి చతుర్భుజాలను కలిగి ఉండి, ఒక చేతిలో స్కందుణ్ణి పట్టుకుని ఉండి, మిగిలిన చేతుల్లో పద్మాలు, అభయ ముద్రలను ధరించి ఉంటుంది. ఈమె ఒడిలో బాలుని రూపంలో స్కందుడు (కుమారస్వామి) కూర్చొని ఉంటాడు. స్కందదేవుని జనని కావడం వలన ఈ దుర్గా స్వరూపం స్కందమాతగా ప్రసిద్ధి చెందింది. స్కందమాతను ఉపాసించడం వలన స్కందదేవుని కూడా ఉపాసన చేసిన ఫలితం లభిస్తుందని, సకల కోర్కెలు నెరవేరడంతో పాటు శాంతి సౌఖ్యాలు లభిస్తాయని పండితులు చెబుతున్నారు. స్కందమాత స్వరూపంలోని శ్రీశైల భ్రామరీకి ఆలయ అర్చకులు, వేదపండితులు వేదమంత్రోచ్చరణల నడుమ ప్రత్యేక పూజా హారతులనిచ్చారు. ప్రత్యేక అలంకారంలోని అమ్మవారి స్వరూపాన్ని భక్తులు దర్శించుకుని పూజలు చేపట్టారు. అలాగే ఉత్సవాల్లో భాగంగా భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామిఅమ్మవార్లు శేష వాహనంపై విహరించి భక్తులకు ఆశీస్సులు అందించారు. స్వామి అమ్మవార్లకు ఆలయ ప్రదక్షిణ నిర్వహించి ఆలయ రాజగోపురం మీదుగా గ్రామోత్సవం చేపట్టారు.

శ్రీశైలంలో నేడు..

ఉత్సవాల్లో భాగంగా మంగళవారం శ్రీశైల క్షేత్రంలో కాత్యాయిని అలంకారంలో అమ్మవారు, హంస వాహనంపై స్వామిఅమ్మవార్లు దర్శనమివ్వనున్నారు.



ఉత్సవంలో వృషభం



ఆకట్టుకున్న మహిళల కోలాటం

ప్రజల వినతులకు ప్రాధాన్యత ఇవ్వండి

- జిల్లా కలెక్టర్ రాజకుమారి

నంద్యాల(అర్బన్): ప్రజా సమస్యల పరిష్కార కార్యక్రమం ద్వారా స్వీకరించిన వినతులను అత్యంత ప్రాధాన్యతగా తీసుకుని త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సెంటినరీ హాల్‌లో పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసెల్ సిస్టమ్–(పీజీఆర్ఎస్) కార్యక్రమంలో పాల్గొని జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్, డీఆర్ఓ పద్మజ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా స్వీకరించిన ప్రతి అర్జీని క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి నాణ్యతతో పరిష్కరించాలన్నారు. కార్యక్రమానికి గైరాజరైన వికలాంగుల శాఖ ఏడీ, వక్ఫ్ బోర్డు ఇన్‌స్పెక్టర్, ఎక్సైజ్, గనుల శాఖ అధికారి, స్కిల్ డెవలప్‌మెంట్, ఉప రవాణా అధికారులకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలన్నారు. పీజీఆర్ఎస్‌కు 90 శాతం సమస్యలు రెవెన్యూకు సంబంధించిన భూ సమస్యలే అధికంగా వస్తున్నాయన్నారు. ఇటీవల జరిగిన భూ బదలాయింపులో నిబంధనలు అతిక్రమించిన అధికారికి మూడు ఇంక్రిమెంట్లు నిలుపుదల చేశామన్నారు.



కలెక్టర్ రాజకుమారితో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

నిజమైన రైతులకు న్యాయం చేయండి

గడివేముల: చెనకపల్లె గ్రామ పొలిమేరలోని నూతనంగా ఏర్పాటు చేస్తున్న సోలార్ ప్రాజెక్టులో పొలాలు నష్టపోయిన నిజమైన రైతులకు పరిహారం అందించాలని నంద్యాల జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి కలెక్టర్ రాజకుమారిని కోరారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో బాధిత రైతులతో కలిసి కాటసాని సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. సాగులో ఉన్న వారందరికీ పరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హామీ ఇచ్చారు. అనంతరం విలేకరులతో కాటసాని రాంభూపాల్‌రెడ్డి మాట్లాడుతూ చెనకపల్లె గ్రామంలోని సర్వే నెంబర్ 791 నుంచి 802 భూములలో సోలార్ పనులు జరుగుతున్నాయన్నారు. ఇందులో 31 ఎకరాల పొలాన్ని గత కొన్నేళ్ల నుంచి రైతులు సాగు చేసుకుంటూ జీవనం చేస్తున్నారన్నారు. సాగులో ఉన్నవారికి పరిహారం అందించకుండా అధికారాన్ని అడ్డుపెట్టుకుని ఇతరులకు పరిహారం ఇచ్చే ప్రయత్నం చేస్తున్నారన్నారు. అధికారులు ఏక పక్షంగా వ్యవహరించకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరామన్నారు. పెసరవాయి, కరిమద్దెల గ్రామాల్లో రెండు రోజుల క్రితం కురిసిన భారీ వర్షానికి నష్టపోయిన సోయాబీన్ రైతులను ఆదుకోవాలని విన్నవించామన్నారు. కాటసాని వెంట జెడ్పీటీసీ సభ్యుడు ఆర్‌బీ చంద్రశేఖరరెడ్డి, పాణ్యం మాజీ జెడ్పీటీసీ సూర్యనారాయణరెడ్డి తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా

గుర్తు తెలియని యాచకుడి మృతి


మృతి చెందిన గుర్తు తెలియని యాచకుడు

కోవెలకుంట్ల: పట్టణంలోని సంత మార్కెట్ సమీపంలో సోమవారం గుర్తు తెలియని యాచకుడు మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. అనంతపురం జిల్లా గుంతకల్లుకు చెందిన 60 ఏళ్ల వృద్ధుడు పది రోజుల క్రితం భిక్షాటన చేసుకుంటూ కోవెలకుంట్లకు వచ్చాడు. ఇక్కడే భిక్షాటన చేస్తూ సంతమార్కెట్ షెడ్‌లో తలదాచుకుంటున్నాడు. రెండు రోజుల నుంచి తీవ్ర అనారోగ్యానికి గురై మృత్యువాత పడ్డాడు. విషయం తెలుసుకున్న పోలీసులు యాచకుడి ఆచూకీ కోసం ఆరా తీసినా వివరాలు లభ్యం కాలేదు. పట్టణానికి చెందిన విక్కీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించారు.

పీఆర్ ఇంజనీర్ల సమస్యల పరిష్కారానికి కృషి


మాట్లాడుతున్న పీ మురళీకృష్ణనాయుడు

కర్నూలు(అర్బన్): రాష్ట్ర వ్యాప్త పంచాయతీరాజ్ ఇంజనీర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఏపీ పీఆర్ ఇంజనీర్స్ అసోసియేషన్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు పి.మురళీకృష్ణనాయుడు అన్నారు. సోమవారం స్థానిక జిల్లా పరిషత్‌లోని విశ్వేశ్వరయ్య భవన్‌లో జరిగిన సమావేశానికి మురళీకృష్ణనాయుడుతో పాటు రాష్ట్ర అధ్యక్షులు సంగీతరావు, సంయుక్త కార్యదర్శి సుధాకర్‌రెడ్డి హాజరయ్యారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు వి.రవీంద్రారెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో కూడా పీఆర్ ఇంజనీర్ల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించామన్నారు. ఎక్కడైనా ఇంజనీర్లు ఎదుర్కొంటున్న సమస్యలను అసోసియేషన్ దృష్టికి తీసుకురావాలన్నారు. సమావేశంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి ఆర్ సతీష్‌కుమార్, డీఈఈలు మహేశ్వరరెడ్డి, నాగిరెడ్డి, రమేష్‌కుమార్‌రెడ్డి, ఏఈఈలు అమర్ తదితరులు పాల్గొన్నారు.

లాటరీ దక్కినా టీడీపీ ట్యాక్స్ తప్పనిసరి!

- 30 శాతం వాటా ఇవ్వాలంటూ బెదిరింపులు

కర్నూలు: ''మద్యం దుకాణాలకు ఇష్టానుసారం దరఖాస్తు చేసుకోకండి.. లాటరీలో దుకాణం దక్కించుకున్నా ఫలితాలు మరోలా ఉంటాయి.. 30 శాతం వాటా అయినా ఇవ్వాలి.. లేదా దరఖాస్తు ఫీజు రూ.2 లక్షలు తీసుకుని దుకాణాన్ని మాకే అప్పగించాలి.'' అని ఆళ్లగడ్డ, నందికొట్కూరు, శ్రీశైలం నియోజకవర్గాల్లో ఆశావహులకు ఫోన్లు వెళ్తున్నాయి. దరఖాస్తులు మా వాళ్లే వేస్తారు, కాదు.. కూడదని ఎవరైనా దరఖాస్తు చేసినా తన సహకారం లేకుండా వ్యాపారం చేయలేరని పత్తికొండ నియోజకవర్గంలో పరోక్ష హెచ్చరికలు చేస్తుండటం చర్చనీయాంశంగా మారింది. ఎవరైనా దరఖాస్తు చేసుకోండి.. లాటరీలో దుకాణం దక్కించుకున్న వారు పెట్టుబడి లేకుండానే తమకు 30 శాతం వాటా ఇవ్వాలని ఆదోనిలో ఓ మాజీ ఎమ్మెల్యే కార్యాలయం నుంచి హెచ్చరికలు చేస్తున్నారు. ఇదే తరహా బెదిరింపులు ఎమ్మిగనూరు, కోడుమూరు, ఆలూరు నియోజకవర్గాల్లోనూ వినిపిస్తున్నాయి. ఉమ్మడి జిల్లాలోని మరికొన్ని నియోజకవర్గాల్లో కీలక నేతల కుటుంబీకుల కనుసన్నల్లోనే మద్యం దుకాణాలకు దరఖాస్తులు దాఖలయ్యేలా తెలుగు తమ్ముళ్లు చూసుకుంటున్నారు. వ్యాపారాన్ని బట్టి ఒక్కో మద్యం దుకాణానికి రూ.8 లక్షల నుంచి రూ.10 లక్షలు నియోజకవర్గ 'పెద్ద'కు చెల్లించాలనే ప్రతిపాదన ఎమ్మిగనూరులో తెరపైకి తెచ్చినట్లు టీడీపీ నేతలు, ఎక్సైజ్ అధికారుల్లో చర్చ జరుగుతోంది. ఇదిలాఉంటే మద్యం దుకాణాలకు ఔత్సాహిక వ్యాపారుల నుంచి దరఖాస్తులు పడకుండా ప్రజాప్రతినిధులే అడ్డుకుంటున్నట్లు ఉమ్మడి జిల్లా ఎక్సైజ్ అధికారులు ఆ శాఖాధిపతి ద్వారా సీఎం చంద్రబాబుకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం.



భారీగా పెరిగిన పెట్టుబడి

- మద్యం దుకాణాల పెట్టుబడులు గతంతో పోలిస్తే భారీగా పెరిగాయి.
- రూ.50 వేలు ఉన్న నాన్ రీఫండబుల్ ఫీజు ప్రస్తుతం రూ.2 లక్షలకు పెంచారు.
- మద్యం దుకాణం దక్కాలంటే ఇప్పుడున్న పరిస్థితుల్లో సగటున 5 నుంచి 10 దరఖాస్తులు వేస్తే తప్ప దక్కే అవకాశం లేదు.
- లైసెన్స్ ఫీజు గతంలో రూ.30 లక్షల్లోపు ఉండగా ప్రస్తుతం రూ.65 లక్షలకు పెంచారు.
- పైగా రూరల్, అర్బన్ ప్రాంతాల్లోనూ ఒకే రకం ఫీజు నిర్ణయించారు.
- రెండో ఏడాది ఈ ఫీజు మరో పది శాతం పెరగనుంది.
- కర్నూలు, నంద్యాల, ఆదోని వంటి ముఖ్య పట్టణాల్లో ఒక షాపు పెట్టుబడి సుమారు రూ.కోటి వరకు ఉంటుంది.
- ఈ లెక్కన ప్రతి దుకాణంలో మద్యం అమ్మకాలు రోజుకు రూ.2 లక్షలు జరిగితేనే కొద్దిపాటి లాభం ఉంటుందని పాత వ్యాపారులు అంచనా వేస్తున్నారు.

ఒత్తిళ్లకు తావులేకుండా దరఖాస్తు ప్రక్రియ


సమావేశంలో మాట్లాడుతున్న ఎక్సైజ్ సూపరింటెండెంట్ రవికుమార్

కోవెలకుంట్ల: నూతన మద్యం పాలసీలో రాజకీయ, అధికారిక ఒత్తిళ్లు లేకుండా దరఖాస్తు ప్రక్రియ చేపడుతున్నట్లు ఆ శాఖ సూపరింటెండెంట్ రవికుమార్ తెలిపారు. సోమవారం రాత్రి కోవెలకుంట్లలోని ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్‌లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలోని ఏడు ఎక్సైజ్ స్టేషన్ల పరిధిలో 105 మద్యం దుకాణాలను ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించేందుకు నోటిఫికేషన్ విడుదలైందన్నారు. ఈ నెల 9వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఈనెల 11న కలెక్టర్ కార్యాలయంలో మద్యం దుకాణాల కేటాయింపునకు లాటరీ నిర్వహిస్తామన్నారు. దరఖాస్తు, టెండర్ విధానంలో ఏవైనా అభ్యంతరాలు ఉంటే నేరుగా మాట్లాడవచ్చన్నారు. 8008828467 నంబర్‌కు ఫోన్ చేసి సమస్యలు, ఒత్తిళ్లు, తదితరాలను తెలియజేయవచ్చన్నారు. విలేకరుల సమావేశంలో ఎక్సైజ్ సీఐ తాకీబాష, ఎస్‌ఐలు ప్రవీణ్‌కుమార్‌నాయక్,సందీప్‌యాదవ్, సిబ్బంది పాల్గొన్నారు.

ఒక్కరోజే 659 దరఖాస్తులు

మద్యం దుకాణాలు దక్కించుకునేందుకు ఆశావహులు ఎక్సైజ్ స్టేషన్లకు క్యూ కడుతున్నారు. సోమవారం ఒక్క రోజే ఉమ్మడి కర్నూలు జిల్లాలో 659 దరఖాస్తులు సమర్పించారు. కర్నూలు జిల్లాలో 99, నంద్యాల జిల్లాలో 105 మద్యం దుకాణాలకు నోటిఫికేషన్ వెలువడింది. ఈనెల 1వ తేదీ నుంచి ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో ఆశావహులు దరఖాస్తు చేస్తున్నారు. ఆరు రోజుల పాటు సాగిన ప్రక్రియలో కర్నూలు జిల్లాలో 360 దరఖాస్తులు, నంద్యాల జిల్లాలో 260 దరఖాస్తులు మాత్రమే దాఖలయ్యాయి. మరో రెండు రోజులు మాత్రమే గడువు ఉండటంతో ఆన్‌లైన్ దరఖాస్తులు ఊపందుకున్నాయి. నంద్యాల జిల్లాలో ఇంకా 13 షాపులకు, కర్నూలు జిల్లాలో 8 దుకాణాలకు ఇప్పటి వరకు దరఖాస్తుల బోణీయే కాకపోవడం గమనార్హం.

కొత్త వ్యక్తులు ఆసక్తి కనబరుస్తున్నారు



మద్యం దుకాణాల నిర్వహణపై కొత్త వ్యక్తులు ఆసక్తి చూపుతున్నారు. కార్యాలయానికి వచ్చిన వారందరికీ తక్షణ సమాచారం ఇచ్చేలా స్టేషన్లలో ఏర్పాట్లు చేశాం. దరఖాస్తుల స్వీకరణ ఈనెల 9న ముగుస్తుంది. 11న లాటరీ తీసి షాపులను కేటాయిస్తాం.

– సుధీర్ బాబు, ఈఎస్, కర్నూలు

హోరాహోరీగా షూటింగ్ బాల్ పోటీలు

- బాలుర విజేత అన్నమయ్య, బాలికల విజేత నెల్లూరు జట్లు
- విజేతలకు ట్రోఫీ, మెడల్స్ ప్రదానం



ట్రోఫీతో బాలుర విజేత, బాలికల రన్నరప్ అన్నమయ్య జట్టు



బాలికల విజేత నెల్లూరు జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న నిర్వాహకులు

సి.బెళగల్: మండల కేంద్రంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో రెండు రోజులుగా జరుగుతున్న 7వ ఆంధ్రప్రదేశ్ అంతర్ జిల్లాల జూనియర్ షూటింగ్ బాల్ చాంపియన్‌షిప్-2024 పోటీలు సోమవారం ఫైనల్ మ్యాచ్‌లతో ముగిశాయి. ప్రిన్సిపాల్ బాలరాముడు అధ్యక్షతన, పీడీ రాఘవేంద్ర, పీఈటీ ప్రభాకర్ రాష్ట్రస్థాయి పోటీలను నిర్వహించారు. పోటీల్లో 18 జిల్లాలకు చెందిన 450 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. రెండవ రోజు సెమీ ఫైనల్, ఫైనల్ మ్యాచ్‌లను నిర్వాహకులు సమర్థవంతంగా నిర్వహించారు. విజేతలకు ట్రోఫీ, మెడల్స్ ప్రదానం చేశారు.

రసవత్తరంగా ఫైనల్ మ్యాచ్‌లు

షూటింగ్‌బాల్ చాంపియన్‌షిప్ ఫైనల్ పోటీలు సోమవారం హోరాహోరీగా సాగాయి. బాలికల ఫైనల్‌లో నెల్లూరు – అన్నమయ్య జట్ల మధ్య మ్యాచ్ రసవత్తరంగా సాగింది. ఆ జట్లు చెరో సెట్‌లో ఆధిక్యం కనబరచగా నిర్ణయాత్మక మూడో సెట్లో 21-18 పాయింట్ల తేడాతో అన్నమయ్య జట్టుపై నెల్లూరు జట్టు విజయం సాధించి చాంపియన్‌గా నిలిచింది. రన్నరప్‌గా అన్నమయ్య, అనంతపురం జట్టు మూడో స్థానంలో నిలిచింది. అదేవిధంగా బాలుర ఫైనల్‌లో పల్నాడు – అన్నమయ్య జట్లు తలపడగా 12- 21 పాయింట్లతో అన్నమయ్య జట్టు విజేత నిలిచింది. రన్నరప్‌గా పల్నాడు, మూడవ స్థానంలో ఎన్టీఆర్ జిల్లా జట్టు నిలిచింది. పోటీల నిర్వహణలో అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పరశురాముడు, పీఈటీలు రవి, స్థానిక నేతలు చంద్రశేఖర్, గోవిందు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా సమగ్రాభివృద్ధికి ప్రణాళిక


సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి టీజీ భరత్

కర్నూలు(సెంట్రల్): జిల్లా సమగ్రాభివృద్ధికి స్వర్ణాంధ్ర-2047 డాక్యుమెంట్ రూపకల్పన జరగాలని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో ప్రణాళిక రూపకల్పనపై ప్రజాప్రతినిధులతో కలెక్టర్ అభిప్రాయ సేకరణ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఓర్వకల్ ఇండస్ట్రియల్ హబ్ జిల్లా అభివృద్ధికి గ్రోత్ ఇంజిన్‌గా పనిచేస్తుందన్నారు. దాదాపు రూ.2,800 కోట్ల పెట్టుబడులకు రంగం సిద్ధమవుతోందన్నారు. కలెక్టర్ పి.రంజిత్‌బాషా మాట్లాడుతూ జిల్లాలో 15 శాతం వృద్ధి రేటు సాధించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. జిల్లా పంచాయతీరాజ్ శాఖ ద్వారా రూ.110 కోట్లతో రోడ్లను అభివృద్ధి చేస్తామన్నారు. ఈ సందర్భంగా పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి, ఆదోని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి, ఎమ్మిగనూరు ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి మాట్లాడుతూ స్థానిక సమస్యలను సమావేశం దృష్టికి తీసుకొచ్చారు.

- ఆలూరు ఎమ్మెల్యే విరుపాక్షి మాట్లాడుతూ వేదవతి ప్రాజెక్టును పూర్తి చేయాలని, ఏబీసీ కెనాల్‌ను హంద్రీనీవాతో అనుసంధానం చేయాలని కోరారు.
- మంత్రాలయం ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి మాట్లాడుతూ గురురాఘవేంద్ర ప్రాజెక్టు మోటార్లన్నీ చెడిపోయాయని, వాటిని బాగు చేయించేలన్నారు. ఆర్‌డీఎస్ కుడి కాలువను నిర్మించడం ద్వారా ఎమ్మిగనూరు, మంత్రాలయం నియోజకవర్గాలకు సాగు, తాగునీటిని అందించేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. సమావేశంలో సీపీఓ ప్రభాకరరాజు, డీఆర్వో చిరంజీవి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వలంటీర్లకు గౌరవ వేతనాలు చెల్లించాలి


ర్యాలీగా వస్తున్న వలంటీర్లు

నంద్యాల(అర్బన్): గ్రామ, వార్డు వలంటీర్లకు పెండింగ్ బకాయిలతో పాటు వేతనాలు చెల్లించకుంటే నిరసన దీక్షలు చేపడుతామని ఏపీ గ్రామ వార్డు వలంటీర్స్ అసోసియేషన్ నంద్యాల జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి హెచ్చరించారు. ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీల మేరకు వలంటీర్లకు ఉద్యోగ భద్రత కల్పించడంతో పాటు రూ.10 వేలు చొప్పున గౌరవ వేతనం ఇవ్వాలని కోరుతూ జిల్లా వలంటీర్లు సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. అనంతరం కలెక్టర్ రాజకుమారికి వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. వలంటీర్లకు రూ.10వేల వేతనం, ఉద్యోగ భద్రత కల్పిస్తామన్న కూటమి ప్రభుత్వం వాగ్దానాన్ని తక్షణమే కార్యాచరణలోకి తేవాలన్నారు.


మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటై నాలుగు నెలలు పూర్తవుతున్నా వలంటీర్ల వ్యవస్థపై ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడం దారుణమన్నారు. బలవంతపు రాజీనామాలు చేసిన వలంటీర్లను తక్షణమే విధుల్లోకి తీసుకోవాలన్నారు. మూడు నెలల పెండింగ్ బకాయిలు తక్షణమే చెల్లించి ఆదుకోవాలన్నారు.

నాటుసారా కట్టడికి ప్రత్యేక బృందాలు

ఆలూరు: విజయదశమి ఉత్సవాలలో భాగంగా హొళగుంద మండలం దేవరగట్టులో ఈ నెల 12న జరగనున్న బన్నీ (కర్రల సమరం) నాటికి నాటుసారాను పూర్తిగా అరికట్టేందుకు ప్రత్యేక బృందాలు పని చేస్తున్నాయని జిల్లా అసిస్టెంట్ ఎక్సైజ్ కమిషనర్ హనుమంతరావు స్పష్టంచేశారు. స్థానిక ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయంలో నూతన మద్యం షాపులకు సంబంధించి దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమాన్ని ఆయన సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. జిల్లాలోని మద్యం షాపులకు సిండికేట్ ఏమీ లేదన్నారు. ఎవరైనా ఇంటి నుంచి కూడా దరఖాస్తు చేసుకునేలా ప్రభుత్వం https://haFsproject.com వెబ్‌సైట్‌ను ప్రారంభించిందని చెప్పారు. స్థానిక ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయంలోనూ ఈ నెల 9వ తేదీలోగా దరఖాస్తు చేసుకునేలా వెసులుబాటును కల్పించామన్నారు. ఎక్సైజ్ సీఐ లలితాదేవి, ఎస్‌ఐ నవీన్ తదితరులు ఉన్నారు.


మాట్లాడుతున్న జిల్లా అసిస్టెంట్ ఎక్సైజ్ కమిషనర్ హనుమంతరావు

కాల్వబుగ్గ దేవస్థానం నిధులు స్వాహా!

- ఈఓ రూ.1.20 కోట్లు దుర్వినియోగం చేసినట్లు ప్రాథమిక నిర్ధారణ

ఓర్వకల్లు: కాల్వబుగ్గ దేవస్థానం నిధులు స్వాహా అయిన సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. మండలంలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన కాల్వబుగ్గ దేవస్థానానికి భక్తుల నుంచి వివిధ రూపాల్లో సమర్పించిన నిధులను ఆలయ ఈఓ డీఆర్‌కేవి ప్రసాద్ హుసేనాపురం గ్రామీణ బ్యాంక్‌లో దేవస్థానం తరుపున వ్యక్తిగత ఖాతా సృష్టించి జమ చేశాడు. ఆ నిధుల్లో రూ.1.20 కోట్లను దశల వారీగా స్వాహా చేసినట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి. దీంతో సోమవారం దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ సుధాకర్‌రెడ్డి ఆలయానికి చేరుకుని రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆలయ భూములు, వివిధ వ్యాపారాలకు సంబంధించిన నిధులను ఈఓ తన వ్యక్తిగత ఖాతాకు జమ చేసినట్లు ప్రాథమిక విచారణలో తేలింది. ఈ విషయంపై సంబంధిత బ్యాంక్ ఖాతాలో లావాదేవీలను మంగళవారం బ్యాంకు వద్దకు వెళ్లి విచారణ చేయనున్నట్లు ఏసీ తెలిపారు.


ధరల నియంత్రణలో ప్రభుత్వం విఫలం



ధర్నా నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

కర్నూలు(సెంట్రల్): పెరిగిపోతున్న నిత్యావసర సరుకుల ధరలను నియంత్రించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్ విమర్శించారు. సోమవారం సీపీఎం ఓల్డ్‌సిటీ కమిటీ ఆధ్వర్యంలో నిత్యావసర సరుకుల ధరలను తగ్గించాలని కోరుతూ నగర కార్యదర్శి ఎం.రాజశేఖర్ అధ్యక్షతన గడియారం ఆసుపత్రి సమీపంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చంద్రబాబు ముఖ్యమంత్రి అయ్యాక ధరల నియంత్రణపై పట్టు కోల్పోవడంతో మధ్యవర్తులు ఇష్టానుసారంగా రేట్లు పెంచి పేద, మధ్య తరగతి వర్గాల ప్రజలపై భారం మోపుతున్నారన్నారు. అధికారం లేని సమయంలో ఇంటింటా తిరుగుతూ నిత్యావసర ధరలను తగ్గించాలని డిమాండ్ చేసిన తెలుగుదేశం పార్టీ ఇప్పుడు కిమ్మనకుండా ఉండడంపై మండిపడ్డారు. బియ్యం, బ్యాళ్లు, మంచినూనె, పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్ ధరలు ఆకాశన్నంటుతున్నాయన్నారు. బియ్యం, బ్యాళ్లు, నూనెల ధరలు ఎప్పుడూ లేనంతగా పెరిగిపోతున్నా ప్రభుత్వం పట్టించుకోవడంలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలపై భారం తగ్గేలా చౌక దుకాణాల ద్వారా 14 రకాల నిత్యావసర వస్తువులను అందించాలని డిమాండ్ చేశారు. ప్రతి వస్తువును జీఎస్టీ పరిధిలోకి తెచ్చి దోచుకుంటున్న ప్రభుత్వం పెట్రో ఉత్పత్తులను ఎందుకు జీఎస్టీ పరిధిలోకి తేవడం లేదో సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. వర్షాలు సరిగ్గా కురవక పంటలు నష్టపోయి ఇబ్బందుల్లో ఉన్న రైతులకు రూ.2 లక్షల రుణ మాఫీ చేయాలన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పేదలకు రెండు సెంట్ల ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరారు. ప్రజా వ్యతిరేక విధానాలను అనుసరిస్తున్న చంద్రబాబు ప్రభుత్వానికి త్వరలోనే ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. నాయకులు ఎం.విజయ్, రామాంజనేయులు, నగేష్, ఎస్‌ఎండీ షరీఫ్, అబ్దుల్‌దేశాయ్, రామకృష్ణ, ఎస్‌డీ ఖాజాపాషా, పాల్‌బాషా, మహ్మద్ రఫీ తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్‌లో జిల్లా యువకుడి దుర్మరణం


జయప్రకాష్ (ఫైల్)

ఎమ్మిగనూరురూరల్: పట్టణానికి చెందిన యువకుడు జయప్రకాష్ (24) సోమవారం హైదరాబాద్‌లో కంటైనర్ లారీని ఢీకొని దుర్మరణం చెందాడు. వివరాలు.. స్థానిక వీవర్స్ కాలనీకి చెందిన గురురాజ, రాజేశ్వరిలకు ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు జయప్రకాష్ బీటెక్ పూర్తి చేశాడు. కొన్ని రోజుల క్రితం ఉద్యోగ అన్వేషణలో భాగంగా హైదరాబాద్‌లో ఉంటున్న స్నేహితుల వద్దకు వెళ్లాడు. సోమవారం బైక్‌పై వెళుతూ రోడ్డును క్రాస్ అవుతున్న కంటైనర్ లారీని ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటనపై స్నేహితులు ఎమ్మిగనూరులోని తల్లిదండ్రులకు సమాచారం అందించారు. పుట్టెడు శోకంతో తల్లిదండ్రులు హైదరాబాద్‌కు బయలుదేరి వెళ్లారు.

ఎల్‌హెచ్‌ఎంఎస్‌ను వినియోగించుకోండి


బిందు మాధవ్, ఎస్పీ

కర్నూలు: దసరా పండుగకు ఇళ్లకు తాళాలు వేసి ఊర్లకు వెళ్లే వారు లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టమ్ (ఎల్‌హెచ్‌ఎంఎస్) యాప్‌ను ఉపయోగించుకోవాలని జిల్లా ఎస్పీ బిందు మాధవ్ జిల్లా ప్రజలకు పిలుపునిచ్చారు. ఎల్‌హెచ్‌ఎంఎస్ యాప్ ద్వారా లేదా 91211 01075 నెంబర్‌కు స్థానిక పోలీస్‌స్టేషన్‌ను సంప్రదించి సేవలను ఉచితంగా ఉపయోగించుకోవచ్చని సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. తాళం వేసిన ఇళ్లు లక్ష్యంగా జరిగే దొంగతనాలను నివారించడానికి ఈ యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లో ఈ సదుపాయం అందుబాటులో ఉందన్నారు.

మహిళా కూలీ దుర్మరణం

- మరో ఇద్దరికి గాయాలు
- ఆటోను మోటార్ సైకిల్ ఢీకొట్టడంతో ప్రమాదం

దొర్నిపాడు: వారంతా వ్యవసాయ కూలీలు. ఉదయం లేచి ఇంటి పనులు పూర్తి చేసుకొని రోజులాగే సీడ్‌పత్తి క్రాసింగ్ పనికి ఆటోలో బయలుదేరారు. పొలం వద్ద దిగే సమయంలో మోటార్ సైకిల్ మృత్యువులా దూసుకొచ్చి ఆటోను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఓ మహిళ దుర్మరణం చెందగా, మరో ఇద్దరికి గాయాలయ్యాయి.

అంతా కూలీలే

కోవెలకుంట్ల మండలం భీమునిపాడు గ్రామానికి చెందిన కూలీలు రోజూ ఆటోలో దొర్నిపాడు మండలం డబ్ల్యూ.గోవిందిన్నె గ్రామానికి సీడ్ పత్తి క్రాసింగ్ పనులకు వస్తుంటారు. సోమవారం పని నిమిత్తం ఆటోలో పొలం సమీపంలోకి రాగానే ప్రమాదం జరిగింది. ఆటోలో కుడివైపు కూర్చొన్న ఉసేన్‌బీ (35), సుశీలమ్మ, ఉసేన్‌బాషాను బైక్ ఢీకొట్టడంతో గాయాలపాలయ్యారు. ఉసేన్‌బీ ప్రమాద స్థలంలోనే కోమాలోకి వెళ్లడంతో పొలం యజమాని నాగరాజు కారులో కోవెలకుంట్ల వైద్యశాలకు తీసుకెళ్లాడు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం నంద్యాలకు తరలించారు. అక్కడ ఆమె కోలుకోలేక మృతి చెందింది. అలాగే బైక్‌పై వచ్చిన ప్రశాంత్‌కుమార్ తల, కుడి కాలుకు తీవ్రగాయాలయ్యాయి. ప్రమాదంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎఎస్‌ఐ ప్రతాప్‌రెడ్డి తెలిపారు.


మృతి చెందిన ఉసేన్‌బీ

అయ్యో పాపం

మృతురాలు ఉసేన్‌బీకి ఇద్దరు పిల్లలతో పాటు భర్త మాబువలి ఉన్నాడు. భర్త పక్షవాత రోగి కావడంతో ఆమె కూలీనాలి చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటోంది. ఈ స్థితిలో అకస్మాత్తుగా ఉసేన్‌బీ మృతి చెందడంతో ఇద్దరు పిల్లలు తల్లిని కోల్పోయారని, ఇక వారి ఆలనా పాలన ఎలా? భర్త పరిస్థితి ఎలా? అని తోటి కూలీలు కన్నీరు మున్నీరయ్యారు.